...త్తు బృందాలు, అటు మత్స్యకారులు,
...హెలికాప్టర్లు, గాలింపు చర్యలు

వైద్య సేవలు





# విపత్తు బృందాల స్ఫూర్తి

ప్రతికూల పరిస్థితుల్లో గాలింపు చర్యల్లో తీవ్రంగా శ్రమిస్తున్న బృందాలు, మత్స్యకారులు

21 JUL 2018



దేవీపట్నం వద్ద పడవ ప్రమాదంలో విపత్తు బృందాల సేవలు (ఫైల్)

పశువుల్లంక వద్ద వెతుకులాట

యానాం, జూలై 20: ఒకవైపు బలమైన ఈదురుగాలులు, ప్రతికూల వాతావరణం, పరిస్థితులు, ఎప్పటికప్పుడు ఆటుపోట్లతో సాగే వరద ఉధృతి, గోదావరికి ఎదురీదుతూ లైఫ్‌బోట్లలో వెతుకులాట, ఒకవైపు ఒడ్డున మంత్రులు, ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజలు వీరి ఆతృత..క్షణక్షణం నివేదికలు..ఏమైనా దొరికారా? ఆంటూ ప్రశ్నలు..అదొక ఒత్తిడి.. అసలు గల్లంతైన వారు ఎక్కడ ఉన్నారో తెలీదు..ఎలాంటి పేరిస్థితుల్లో ఉన్నారో తెలీదు.. గమ్యం లేని వెతుకులాట.. బోటుపై నుంచి వెతకాలి.. ప్రవాహ వేగానికి తట్టుకుంటూ నీటిలో ఈదుతూ వెతకాలి..తీరా మృతదేహాలు దొరికితే వారిని ఒడ్డుకు తీసుకురావడమనేది ఒక యజ్ఞంగానే భావించాలి..ఇలా ప్రజాసేవలో చేసేది ప్రభుత్వ ఉద్యోగమే కావచ్చు..కానీ ప్రాణాలకు తెగించి, ఒక సాహసోపేతంగా పనిచేయడమనేది ఒక గొప్పవిషయం..ఇటీవల జరిగిన రెండు పడవ ప్రమాదాల్లో విపత్తు బృందాలు చూపిస్తున్న సేవాస్ఫూర్తి ఎందరికో ఆదర్శం..మిలట్రీవాళ్లు దేశం కోసం సేవ చేస్తారని అంటుంటారు..మరి మన పక్కనే మనకోసం.. కనీసంకడసారి చూపునైనా కన్నవారికి అందించాలనే ఏకైక దృఢ సంకల్పంతో పనిచేసే విపత్తు బృందాలపై ప్రత్యేక కథనం..ఆంధ్రజ్యోతి పాఠకులకు ప్రత్యేకం..

పశువుల్లంక పడవ బోల్తా ఘటనలో, ఇటీవల దేవీపట్నం వద్ద బోటు ఘటనలో గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్పీఎఫ్, ఏపీఎస్పీ, ఏఎస్ఎస్, నేవీ బృందాలతో పాటు ఫైర్ సిబ్బంది ఈ గాలింపు చర్యల్లో పాల్గొన్నారు.

ఎన్డీఆర్ఎఫ్‌కు సంబంధించి డీఎస్పీ దేవానంద్ నేతృత్వంలో 61 మంది, ఎన్డీఆర్ఎఫ్‌కు సంబంధించి కోటేశ్వరరావు నేతృత్వంలో 74 మంది, ఎస్పీఎఫ్ కేశవరావు నేతృత్వంలో 46 మంది, ఏపీఎస్పీకు సంబంధించి 50 మంది, ఏఎస్ఎస్ సిబ్బంది 20 మంది, నేవీకి సంబంధించి 20 మందితో పాటు రెండు హెలీకాప్టర్లు, ఫైర్ సిబ్బంది సుమారుగా 50 మంది గాలింపు చర్యలలో పాల్గొన్నారు. వీటితో పాటు ఆయా ఆపరేషన్ కేంద్రాల వద్ద అమలాపురం, రామచంద్రపురంకు చెందిన ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ ప్రతినిధులు తదితరులు విధులు నిర్వహిస్తున్నారు. 19 బోట్లలో ప్రతి రోజూ విపత్తు నివారణ సిబ్బందితో పాటు స్థానిక మత్స్యకారుల కూడా గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలలో పాల్గొంటున్నారు.

## గాలింపు చర్యలలో మత్స్యకారుల పాత్ర

పడవ బోల్తా ఘటనలో గల్లంతైన వారి ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలలో స్థానిక మత్స్యకారులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మల్లాడి కృష్ణారావు ఆదేశాల మేరకు ఆటు యానాంలోని అధికారులు, స్థానిక మత్స్యకార గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఈ గాలింపు చర్యలలో పాల్గొన్నారు. మూడు మృతదేహాలను యానాంకు చెందిన మత్స్యకారులు గుర్తించి సెర్చ్ ఆపరేషన్ కేంద్రానికి అప్పగించారు. ప్రతీరోజూ నావకు ఐదుగురు చొప్పున ఐదు నావలపై 25 మంది గాలింపు చర్యలలో పాల్గొన్నారు. శుక్రవారం ప్రత్యేకంగా 13 నావలపై నావకు ఐదుగురు చొప్పున పాల్గొన్నారు. వీరిలో నాలుగు నావలను యానాం రాజీవ్‌బీచ్ నుంచి పశువుల్లంక వరకు, మరో నాలుగు నావలను సముద్రం మొగ వరకు గోదావరి అంచులలో గాలించేందుకు పయనమై వెళ్లారు.గల్లంతైన వారిలో ఏ ఒక్కరి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పాటు భైరవపాలెంకు చెందిన మత్స్యకారులు ఐదు నావలపై గాలింపు చర్యలలో పాల్గొన్నారు. యానాం మత్స్యకారులు ప్రభుత్వానికి అందిస్తున్న సహకారం పట్ల డీఎస్పీ ప్రసన్నకుమార్ అభినందించారు. దీనికి తోడు ఎమ్మెల్యే బుచ్చిబాబు సహకారాన్ని కూడా నగదు రూపంలో అందజేస్తూ మత్స్యకారులు చేస్తున్న సహాయ సహకారాలను అభినందిస్తున్నారు.